ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పశ్చిమ గోదావరి

జిల్లా వార్తలు

3

సోమవారం 12 ఆగస్టు 2024

భీమవరం ఉష్ణోగ్రతలు



గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 26.0

తణుకు : 33.0 - 25.0



వరదొచ్చినా పులస ఏది ?

మార్కెట్‌లో ఒడిశా పులసలు

నరసాపురం, ఆగస్టు 11: పుస్తెలు తాకట్టు పెట్టయినా పులస చేప తినాలన్నది గోదావరి జిల్లాల్లో నానుడి. కేవలం వరదల సమయంలో దొరికే ఈ అరుదైన చేప రుచి మాంసాహారుల్ని మైమరపిస్తుంది. అందుకే చేపల్లో రారాజు అంటారు. వరద వచ్చిందంటే చాలు ఈ చేప కోసం ఎగబడతారు. ఎంత దూరమైనా వెళ్లి పులస పట్టుకొస్తారు.. చుట్టాలకు, బంధువులకు వండి పంపుతారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఈ చేప గత మూడేళ్ల నుంచి పెద్దగా చిక్కడం లేదు. గోదావరికి వరదొచ్చి నెల రోజులు దాటింది. అయినా చేప దొరికిన దాఖలావు లేవు. సముద్ర గర్భంలో ఉండే ఈ చేప చప్ప నీరుకు ఎదురొస్తుంది. దీంతో ఇలస.. పులసగా మారుతుంది. చప్పనీరులోకి రావడంతో దీని రుచి కూడా మారిపోతుంది. అత్యధికంగా నరసాపురం, యలమంచిలి, ఆచంట, సిద్ధాంతం ప్రాంతాల్లో ఈ చేపల అమ్మకాలు జరుగుతాయి. వరదల సమయంలో మత్స్యకారులు రేయింబవళ్లు పులసల కోసం వేటాడుతుంటారు. అయితే ఈ సారి పెద్దగా చిక్కలేదు. ఒకటి రెండు పడినా అవి వేలల్లో అమ్ముడైపోయాయి. కొంతకాలం నుంచి జిల్లాలోకి ఒడిశా పులసలు లభ్యమవుతున్నాయి. అక్కడ చౌకగా దొరికే ఈ చేపను ఐస్‌బాక్స్‌ల్లో పెట్టి జిల్లాకు తీసుకొచ్చి రెట్టింపు ధరలకు అమ్ముతున్నారు. తెలియక కొందరు మోసపోతుంటే మరికొందరు ఒడిశా పులస అని గుర్తించి బేరం చేసి కొంటున్నారు. సాధారణంగా పులస కేజీ దాటి ఉండదు. 700 నుంచి 900 గ్రాముల మధ్య ఉంటుంది. గోదావరి పులస అయితే ప్రస్తుతం డిమాండ్ బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముతారు. అదే ఒడిశా పులస అయితే రూ . 1000 నుంచి రూ.1500 మధ్య అమ్ముతున్నారు. సరుకు ఎక్కువగా వస్తే రూ.900కు కూడా ఇచ్చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తరహా పులసలు ఎక్కువగా నరసాపురం మార్కెట్‌తో పాటు చించినాడ వంతెన వద్ద అమ్ముతున్నారు.



చెత్త వాహనాల్లోనూ నొక్కుడే !



వైసీపీ హయాంలో కుదిరిన ఒప్పందం వల్ల మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలోనే నష్టం జరుగుతోంది. ప్రజా ధనం దుర్వినియోగం అవుతోంది. చెత్త సేకరణ వాహనాల కొనుగోళ్ల ద్వారా ఏజన్సీ రూపంలో వైసీపీ నేతలు, అందుకు వంత పాడిన అధికారులకు ప్రయోజనం చేకూరుతుందంటూ తెలుగుదేశం కూటమి నేతలు మండిపడుతున్నారు.



- వైసీపీ హయాంలో అడ్డగోలు ఒప్పందం
- పురపాలక సంఘాల నుంచి వాయిదాల రూపంలో దోపిడీ
- బ్యాంకుల్లో సొమ్ములు జమ
- ప్రభుత్వమే ఏజన్సీకి చెల్లింపులు
- మహిళా ఐఏఎస్ సూత్రధారి
- బకాయిలు చెల్లించలేమంటున్న మున్సిపాలిటీలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పట్టణాల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్న వాహనాలు మున్సిపాలిటీవి కావు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. ఏజన్సీ ద్వారా వాహనాలు కేటాయించింది. మున్సిపాలిటీలకు వాహనాలతో సంబంధం లేదు. ప్రతినెలా ఏజన్సీకి వాయిదా రూపంలో సొమ్ములు చెల్లించాల్సి ఉంటుంది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ హయాంలో ఈ విధానాన్ని అమలు చేశారు. అవే వాహనాలు ఇప్పటికీ మున్సిపాలిటీల్లో చెత్త సేకరణకు ఉపయోగిస్తున్నారు. గతంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. చెత్త పన్ను వసూలు చేసి బ్యాంకుల్లో జమ చేసేవారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వానికి వెళ్లిపోయేవి. ప్రభుత్వమే ఏజన్సీకి సొమ్ములు చెల్లించేది. ఇలా ప్రతినెలా వాయిదాలు చెల్లించేలా ఏజన్సీతో గత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దీని వెనుక పెద్ద కుంభ కోణమే జరిగిందంటూ ఇప్పుడు కూటమి నేతలు అనుమాని స్తున్నారు. లేదంటే తక్కువ ఖరీదుతో లభ్యమయ్యే వాహనాలకు పెద్ద మొత్తంలో ప్రతినెలా వాయిదాలు చెల్లించడమేమిటని కూటమి ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టణాల్లో సేకరిస్తున్న చెత్త వాహనాలపై దృష్టి పెట్టారు.మరోవైపు ప్రభుత్వం చెత్తపన్ను వసూళ్లను నిలిపివేసింది. దాంతో వాయిదాలు మొత్తం మున్సి పాలిటీలే చెల్లించే పరిస్థితి నెలకొంది. ప్రతినెలా లక్షలాది రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. గడచిన ఆరు నెలల నుంచి బకాయిలు పేరుకుపోయాయి. భీమవరం మున్సిపాలిటీలోనే రూ. 1.20 కోట్లు బకాయి పడ్డారు. అంత పెద్దమొత్తంలో చెల్లించేందుకు మున్సిపాలిటీ వద్ద నిధులు లేవు. ఎలా చెల్లిస్తామంటూ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వానికి లేఖ రాసేందుకు సిద్ధమవుతున్నారు. భీమవరం పురపాలక సంఘమే ఇలా ఆలోచిస్తోందంటే జిల్లాలోని ఇతర మున్సిపాలిటీల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటుందో అర్థమవుతుంది.

వాహనం ధర రూ. 3 లక్షలు

మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ కోసం ఉపయోగిస్తున్న వాహనాల ధర రూ. 3 లక్షల లోపే ఉంటుంది. చెత్త సేకరణ కోసం ఉపయోగించే ట్రాక్టర్ ధర రూ.6 లక్షలకు మించి ఉండడం లేదు. పైగా ట్రాక్టర్‌లు చెత్త అధికంగా రవాణా చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో వార్డుకు ఒక చెత్త వాహనాన్ని ఉప యోగిస్తున్నారు.అది చాలాచిన్నది. పెద్దగా చెత్త పట్టదు. అయినా ప్రతినెలా వాహనం కోసం మున్సిపాలిటీ రూ.56,500 చెల్లిస్తోంది. అందులో డ్రైవర్‌కు రూ. 15 వేలు కేటాయిస్తున్నారు. నెలకు 100 లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నారు. దీనికోసం మరో రూ.10 వేలు వ్యయం అవుతోంది. చెత్త సేకరణలో మున్సిపాలిటీల్లో పనిచేసే శానిటరీ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారు. అయితే మున్సి పాలిటీ చెల్లించే రూ.56,500లలో కేవలం 25 వేలు మాత్రమే వ్యయం అవుతోంది. మిగిలిన 31 వేలకు లెక్కలు లేవు. ఏజన్సీకి ఎంత చెల్లిస్తున్నారో మున్సిపాలిటీకి తెలియదు. మున్సిపాలిటీకి ఆ నిధులతో సంబంధం లేదు. కేవలం సొమ్ములు బ్యాంకుల్లో జమ చేయడం ఒక్కటే మున్సిపాలిటీలు చేస్తున్నాయి. అంతా ప్రభు త్వమే చూసుకుంటోంది. అంటే ప్రతినెలా వాయిదా రూపంలో రూ.31 వేలు మాత్రం వాహనాలు సమకూర్చే ఏజన్సీకి మిగులు తున్నాయి. అంటే ఏడాదికి రూ. 3.72 లక్షలు చెల్లించారన్నమాట. అలా అయితే వాహనాలు బకాయి తీరిపోవాలి. మున్సిపాలిటీకి వాహనాలు మిగిలిపోవాలి. కానీ మూడేళ్ల నుంచి వాయిదాలు చెల్లిస్తూనే ఉన్నారు. ఏజన్సీకి ఒక్కో వాహనంపై దాదాపు రూ. 11.12 లక్షలు మిగిలింది. అయినా వాహనాలు మాత్రం ఇంకా ఏజన్సీకే ఉన్నాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇటువంటి ఒప్పందం చేసుకున్నారు. మున్సిపాలిటీల పైనా, ప్రజలపైనా ఆర్థిక భారాన్ని మోపారు. ఏజన్సీకి అడ్డగోలుగా లాభాలను చేకూర్చారు. వైసీపీ హయాంలో కుదిరిన ఒప్పందం వల్ల మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలోనే నష్టం జరుగుతోంది. ప్రజా ధనం దుర్వినియోగం అవుతోంది. ఏజన్సీ రూపంలో వైసీపీ నేతలు, అందుకు వంత పాడిన అధికారులకు ప్రయోజనం చేకూరుతుందంటూ తెలుగుదేశం కూటమి నేతలు మండిపడుతున్నారు. ఇకపై వాయిదాలు చెల్లించకూడదంటూ తాడేపల్లిగూడెం మున్సి పాలిటీకి స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. ఇతర మున్సిపాలిటీలు కూడా ముందుకు రావాలని కోరారు. జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నర్సాపురం పట్టణాల్లో చెత్త వాహనాలున్నాయి. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టాలి. గతంలో చేసుకున్న ఒప్పందాలపై విచారణ చేయాలి. అప్పుడే మున్సిపాలిటీలకు న్యాయం జరుగుతుంది. లేదంటే అప్పనంగా మున్సిపాలిటీలు ప్రతిఏటా కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

మహిళా ఐఏఎస్ కీలకం

ఇప్పటికే మున్సిపాలిటీలో పనిచేస్తున్న చెత్త వాహనాలకు ధర కంటే మూడు రెట్లు అధికంగా చెల్లించారు. ఐదేళ్లపాటు ఇలా చెల్లించేలా ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఆ తర్వాత వాహనాలు ఏజన్సీ తీసుకుంటుంది. అప్పుడు కూడా మున్సిపాలిటీకి వాహనాలు ఉండవు. వైసీపీ ప్రభుత్వం ఎంత గుడ్డిగా ఒప్పందం చేసుకుందో అర్థమవుతోంది.సదరు ఒప్పందంలో మహిళా ఐఎఎస్ కీలకంగా వ్యవహరించారు. సదరు మహిళా ఐఎఎస్‌కు చెత్త వాహనాల విషయంలో భాగస్వామ్యం ఉందంటూ కూటమి నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. వాయిదాలు చెల్లించకపోతే గతంలో మహిళా ఐఎఎస్ నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి చీవాట్లు పెట్టిన సందర్భాలున్నాయి.

16 నుంచి జిల్లాలో గ్రామ రెవెన్యూ సదస్సులు

అక్టోబరు 1 నుంచి సమస్యల పరిష్కారానికి శ్రీకారం : కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, ఆగస్టు 11 : ఈనెల 16 నుంచి వచ్చేనెల 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జిల్లాలో ఈనెల 15న లాంచనంగా ప్రారంభించి 45 రోజుల పాటు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 1 నుంచి 45 రోజుల్లో పరిష్కారానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొం దించినట్లు తెలిపారు.జిల్లాలోని 20 మండలాల్లో 318 గ్రామాలు ఉన్నాయని, వాటిలో భీమవరం డివిజన్లో ఏడు మండలాల్లో 117 గ్రామాలు, నరసాపురం డివిజన్లో ఎనిమిది మండలాల్లో 111 గ్రామాలు, తాడేపల్లిగూడెం డివిజన్లో ఐదు మండలాల్లో 90 గ్రామాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

5 కేటగిరీల్లో అర్జీల స్వీకరణ

గ్రామ రెవెన్యూ సభల్లో ప్రజల నుంచి 5 కేటగిరీల్లో పిటిషన్ల స్వీకరించి ఐదు రిజిస్టర్లలో నమోదు చేస్తారని కలెక్టర్ తెలిపారు. మ్యుటేషన్, కౌలు రైతు కార్డులు (ఎల్‌ఈసీ), భూమి వివాదాలు, భూ ఆక్రమణ, నిషేధ జాబితా 22(ఎ)లకు సంబంధించి పిటిషన్లు స్వీకరిస్తారన్నారు. వీటిని ఆన్‌లైన్‌లో పొందుపరిచి, ఆర్‌టీజీఎస్ విభాగం పర్యవేక్షిస్తుంది. ఫిర్యాదు ఇచ్చిన ప్రజలకు వెంటనే రశీదు అందజేస్తారు. వీటన్నింటికీ పరిష్కారం చూపేందుకు ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ సదస్సులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తారు. రెవెన్యూ సదస్సులో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్‌శాఖల ప్రతినిధులు, రిజిస్ట్రేషన్‌శాఖ అధికారి, అటవీ శాఖ అధికారి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటలకే సదస్సులు ప్రారంభమవుతాయని, ఏ గ్రామంలో ఎప్పుడు సదస్సులు నిర్వహిస్తారో ముందస్తుగా తెలియచేస్తారన్నారు. సదస్సుల నిర్వహణ, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకు సీనియర్ ఐఏఎస్ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించనున్నట్లు తెలిపారు. సదస్సుల నిర్వహణకు జిల్లా జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ సదస్సుల్లో జిల్లా మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జడ్పీ చైర్మన్, సభ్యులు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొనేలా సంబంధిత అధికారులు ముందస్తుగా సమాచారం అందజేయాలని ఆదేశించారు.

అందుబాటులో ఇసుక

తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ జిల్లాల వారీగా స్టాక్ పాయింట్ల వద్ద ఇసుక లభ్యత వివరాలను కలెక్టర్ నాగరాణి వెల్లడించారు.పెరవలి మండలం ఉసులుమర్రు-10,965 మెట్రిక్ టన్నులు, పెండ్యాలలో-1,1 6,956 టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు- 41,324 టన్నులు, రావులపాలెం మండలం రావులపాడు-1లో 2,686 టన్నులు, రావులపాడు-2లో 3,260 టన్నులు ఆదివారానికి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

సెల్‌ఫోన్ లోకం

మా అబ్బాయి సెల్ ఫోన్‌కు అలవాటు పడిపోయాడు. ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నాడు. ఒకవేళ బుద్ధిపుట్టి పుస్తకం తీస్తే సహ విద్యార్థి నుంచి ఫోన్ వస్తుంది. ఆన్‌లైన్‌లో ఆడుకుందామా అంటాడు. మా అబ్బాయి కూడా సెల్‌ఫోన్ గేమ్‌లో మునిగిపోతున్నాడు. ఏమీ చేయలేకపోతున్నాం.. తణుకులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థి తండ్రి చెప్పుకున్న వేదన ఇది.

మా అమ్మాయి ఇంటికి వచ్చిన తర్వాత సెల్‌ఫోన్ చూస్తూ ఉండిపోతోంది. ఏమైనా అంటే చికాకు పడుతుందని అనలేక పోతున్నాం. చీవాట్లు పెడితే అమ్మాయి ఏమై పోతుందోనన్న భయమేస్తోంది. ఏమీ చేయలేకపోతున్నాం.. తల్లిదండ్రుల సమావేశంలో ఇటువంటి ఫిర్యాదులే ఇటీవల వినిపిస్తు న్నాయి. చదువు కంటే సెల్‌ఫోన్ పైనే ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయి.





అబ్బాయి ఆరో తరగతికి వెళ్లాడు.. ఇంట్లో మాట వినడం లేదు. నిత్యం సెల్‌ఫోన్‌తోనే ఉంటున్నాడు. అందుకే హాస్టల్‌లో పడేశాం. అక్కడ సెల్‌ఫోన్ చూడడానికి ఉండదు. చదువుకుంటాడు అంటూ తాడేపల్లిగూడెంలో ఓ తండ్రి గొప్పగా చెప్పిన మాటలివి. తల్లిదండ్రుల ప్రేమకు దూరమైనా తప్పనిసరి పరిస్థితిలో చాలామంది ఇలానే చేస్తున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- ఇంటికి వస్తే చాలు..చేతిలోకి ఫోన్..
- గేమ్స్.. వీడియోలతో కాలక్షేపం
- ఉపాధ్యాయులకు ఫిర్యాదులు ఇవే
- ఆందోళనలో తల్లిదండ్రులు
- మాట వినడం లేదంటూ హాస్టళ్ల వైపు..
- చిరుప్రాయంలోనే ప్రేమకు దూరం
- పిల్లలతో గడిపే సమయం ఇవ్వని తల్లిదండ్రులు



ఇలా సోషల్ మీడియా ప్రభావం చిరుప్రాయంలోనే విద్యార్థులపై పడుతోంది. పైగా ఉపాధ్యాయులు కాస్త మందలించినా.. సుతిమెత్తగా చేయి చేసుకున్నా తల్లిదండ్రులు పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులను నిలదీస్తున్నారు. "డబ్బులు చెల్లిస్తున్నాం... ఎందుకు మా పిల్లలపై చేయి చేసుకున్నారు. అందుకే పాఠశాలకు పంపాం. టీచర్ క్షమాపణ చెప్పాలి. లేదంటే స్కూల్ మార్చేస్తాం.. మా అమ్మాయితో పాటు మరి కొందరిని కూడా పాఠశాలను మార్పించేస్తాం" అంటూ ఇటీవల భీమవరంలో ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లిన తల్లి ప్రిన్సిపాల్‌తో గట్టిగా వాదించింది. ప్రిన్సిపాల్ చెప్పినా వినలేదు. ఇలా తల్లిదండ్రుల వైఖరితో ఉపాధ్యాయులు నలిగిపోతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులైతే అటు యాజమాన్యాలతోనూ చీవాట్లు తింటున్నారు. గతంలో విద్యార్థులకు దండన విధిస్తే తల్లిదండ్రులు పట్టించుకునేవారు కాదు. పిల్లలు దారిలో పడతారని భావించేవారు. ఇప్పుడు కాలం మారింది. ఉపాధ్యాయులను తల్లిదండ్రులు నిలదీసే పరిస్థితి నెలకొంది.

పట్టించుకునే సమయమేదీ

పిల్లలు పాఠశాలకు వెళ్లినప్పుడు, వచ్చినప్పుడు ఆలనా పాలనా చూడడం కరువైంది. తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం తగ్గిపోయింది. పిల్లలతో సమానంగా ఇంట్లో తల్లిదండ్రులు సెల్‌ఫోన్‌లలో తలమునకలవుతున్నారు. లేదంటే సీరియల్స్ అంటూ టీవీల మైకంలో పడుతున్నారు. పిల్లలతో గడిపే సమయం తక్కువైపోతోంది. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. పిల్లలు తాతలు, నాన్నమ్మలు కూడా అదే ఇంట్లో ఉండేవారు. నిత్యం పిల్లలతో సరదాగా గడిపేవారు. కొంత సమయం వీధిలో ఆటలకు వెళ్లేవారు. ఇప్పుడు అదిలేదు. ఇంటికి వచ్చిన పిల్లలు చదవుకోవడం లేదంటూ మళ్లీ ట్యూషన్‌లకు పంపుతున్నారు. వచ్చిన తర్వాత పిల్లలు సెల్‌ఫోన్‌లో నిమగ్నమవుతున్నారు. అంతే తప్ప తల్లిదండ్రులతో గడిపే సమయం ఉండడం లేదు. అదే ఇప్పుడు పిల్లల వైఖరికి ప్రధాన కారణమవుతోందంటూ మానసిక నిపుణులు చెపుతున్నారు. ఇంటి వద్ద పిల్లలతో ఎంత సమయం గడిపితే అంత ప్రయోజనం ఉంటుంది. కొంత సమయమైనా మార్కెట్‌కు తీసుకువెళ్లాలి. అప్పుడే తల్లిదండ్రులు తమకు సమయం కేటాయిస్తున్నారన్న అనుబంధం పెరుగుతుంది. తల్లిదండ్రుల మాటకు విలువ నిస్తారు. సెల్‌ఫోన్‌లతో నిత్యం కాలక్షేపం చేసే అలవాటు తగ్గుతుంది. తల్లిదండ్రులు దీనిపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ఇంటికి వచ్చిన తర్వాత పిల్లలు మళ్లీ చదువుపైనే దృష్టి పెట్టాలన్న భావన తల్లిదండ్రుల్లో పెరుగుతోంది. ఇదికూడా పిల్లల మనస్తత్వాన్ని మార్చేస్తుందంటూ ఉపాధ్యాయులు చెపుతున్నారు. అయినా ఇవేమీ తల్లిదండ్రులకు పట్టడం లేదు. పరీక్షల్లో మార్కులొస్తే చాలన్న భావనతో ఉంటున్నారు.


పిల్లల్లో మానసిక రుగ్మతలు

చిరుప్రాయంలోనే హాస్టళ్లలో పిల్లలను చేర్పించడంతో మానసిక సమస్యలు ఎదురవుతున్నాయి. అనారోగ్యం బారిన పడుతున్నారు. భీమవరంలోని ఓ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఉన్నట్టుండి కళ్లు తిరిగిపడిపోయింది. తల్లిదండ్రు లకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి తీసుకు వెళితే అనేక పరీక్షలు నిర్వహించారు. ఏమీ లేదంటూ తేల్చేశారు. భీమవరంలోని అన్ని ఆసుపత్రులకు తిప్పినా ఫలితం కనిపించలేదు. హైదరాబాద్‌లో పేరుమోసిన ఆసుపత్రుల్నింటికీ తిప్పారు. ఉన్నట్టుండి ఒణికిపోతూ విద్యార్థిని పడిపోతుంది. చివరకు మానసిక సమస్యతో ఇబ్బంది పడుతుందంటూ వైద్యులే తేల్చేశారు. దాంతో అమ్మాయిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. హాస్టళ్లలో చదివించే పిల్లల్లో ఇటువంటి సమస్యలు కూడా ఉంటున్నాయి. ఇలాంటి సమస్యలన్నీ అధిగమించాలంటే ఉపాధ్యాయులతో పాటు, ఇంటికి వచ్చే పిల్లలను తల్లిదండ్రులు సక్రమంగా సంరక్షించుకోవాలంటూ మానసిక వైద్య నిపుణులు చెపుతున్నారు. హాస్టళ్లలో చదివితే ఒక ముప్పు.. ప్రతీరోజు ఇంటికి వచ్చేలా ప్రైవేటు పాఠశాలల్లో చేర్పితే మరో సమస్య. ప్రభుత్వ పాఠశాలల్లో చదువు రాదన్న ముద్ర..ప్రభుత్వం ఇచ్చే ట్యాబులతో విద్యార్థులతో చెడు అలవాట్లు. ఇలా అన్ని సమస్యలు పరిష్కారం కావాలంటే తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం పెరగాలి. అప్పుడే పిల్లలు, తల్లిదండ్రుల మధ్య ప్రేమానుబంధాలు మరింత బలపడతాయి. తల్లిదండ్రుల మాటకు పిల్లలు విలువ ఇస్తారు. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు దాదాపు 2.42 లక్షల మంది విద్యార్థులున్నారు. అందులో ఎక్కువ శాతం ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో దాదాపుగా 20 వేల మంది చదువుకొంటున్నారు.

పసిప్రాయంలో ప్రేమకు దూరం

పిల్లలు మాట వినడం లేదనో..భవిష్యత్తు బాగుంటుందనో చిరు ప్రాయంలోనే హాస్టల్‌లో పడేస్తున్నారు. ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలల్లో పిల్లలను చేర్చే తల్లిదండ్రుల సంఖ్య ఇటీవల పెరిగింది. పదేళ్ల పసిప్రాయంలోనే హాస్టళ్లకు పిల్లలను పంపేస్తున్నారు. గతంలో పేదలు ప్రభుత్వ హాస్టళ్లకు పంపేవారు. అక్కడ డిమాండ్ అధికంగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులను చేర్చే సంఖ్య తగ్గిపోయింది. ప్రైవేటు పాఠశాలల్లో హాస్టల్స్ ఉంటే చేర్పించే సంఖ్య పెరిగింది. దీనివల్ల చిరుప్రాయంలోనే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమైపోతున్నారు. మరోవైపు పిల్లలను ప్రేమించే బదులుగా గారాబం చేసే తల్లిదండ్రులే ఇప్పుడు ఎక్కువగా కనిపిస్తున్నారు. అది చివరకు పిల్లలు తల్లిదండ్రుల మాటవినని పరిస్థితి తీసుకొస్తోంది. దాంతో హాస్టళ్లలో చేర్పించి చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఇలా జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

బాధ్యతలను నేర్పాలి



పిల్లలకు తల్లిదండ్రులు బాధ్యతలను నేర్పాలి. ఇంటివద్ద చిన్నపాటి పనులు కూడా చెప్పడం లేదు. పిల్లలు తమ సొంత పనులను కూడా చేసుకోవడం లేదు. పిల్లలతో కలిసి కుటుంబ మంతా భోజనం చేసే రోజులు ఇప్పుడు కనిపించడం లేదు. మార్కులొస్తే చాలన్న భావనలో తల్లిదండ్రులున్నారు. తల్లిదండ్రుల ఉద్దేశాలకు అనుగుణంగా ఇప్పుడు చదువులు మారిపోయాయి.ఇది ఏమాత్రం మంచిది కాదు.

నారాయణ, సైన్స్ టీచర్, తాడేపల్లిగూడెం

పంచాయతీలకు స్వాతంత్ర్యం



- వేడుకలకు వెసులుబాటు
- మైనర్ పంచాయతీలకు రూ. 10 వేలు
- మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు
- సొంత నిధుల నుంచి వెచ్చించుకునే అవకాశం
- గతంలో రూ. 250 లతో సరి



భీమవరం టౌన్, ఆగస్టు 11: పంచాయతీలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవాలకు సొంత నిధులు వెచ్చించుకునే వెసులు బాటు కల్పించారు. ప్రభుత్వం నిర్ణయంతో పంచాయతీ కార్యదర్శులు ఊపిరి పీల్చుకున్నారు. మైనర్ పంచాయతీలకు రూ. 10 వేలు, 5 వేలు జనాభా దాటిన మేజర్ పంచాయతీలకు రూ. 25 వేలు ఖర్చుతో వేడుకలు నిర్వహించుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. గతంలో మైనర్ పంచాయతీలకు రూ. 100, మేజర్ పంచాయతీలకు రూ. 250 మాత్రమే పరిమితి ఉండేది. కానీ స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలకు వేల రూపాయలు ఖర్చు పెట్టేవారు. సర్పంచ్‌లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పెద్దలు హాజరయ్యేవారు. వారందరినీ సత్కరించేవారు. పరిమితికి మించి వెచ్చించే అవకాశం లేదు. చేతి చమురు వదిలిపోయేది. దానిని సర్దుబాటు చేయడానికి పంచాయతీ కార్యదర్శులు నానా తంటాలు పడేవారు. ఈసారి మాత్రం వెసులుబాటు కల్పించడంతో కార్యదర్శులకు ఊరట లభించింది. పంచాయతీలు తమ సొంత నిధుల నుంచి వెచ్చించుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో 409 పంచాయతీలున్నాయి. అందులో 16 పంచాయతీలు పట్టణాల్లో విలీనానికి సిద్ధంగా ఉన్నాయి.అప్పటిదాకా పంచాయతీలుగానే కొనసాగనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈసారి స్వాతంత్ర్య వేడుకలను వైభవంగా నిర్వహించడానికి పంచాయతీలు సిద్ధమవుతున్నాయి. జెండా వందనానికి కూటమి నేతలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు ఆహ్వానాలు పంపుతున్నారు.

నేడు సర్‌ప్లస్ టీచర్లకు ఆన్‌లైన్ సర్దుబాటు కౌన్సెలింగ్

5

నీట్-పీజీ పరీక్ష ప్రశాంతం



భక్తులతో కళకళలాడిన శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల, ఆగస్టు 11: చిన్నతిరుమలేశుని ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేల మంది పైబడి భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. దర్శనానంతరం వారంతా శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బెంగళూరు ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు వరకు పొడిగింపు

నరసాపురం, ఆగస్టు 11: నరసాపురం- బెంగళూరు మధ్య ప్రతి శుక్రవారం నడుస్తున్న 07153 ఎక్స్‌ప్రెస్ రైలును సెప్టెంబరు వరకు పొడిగిస్తూ దక్షిణ మధ్య రైల్వే ఉత్తర్వులు జారీ చేసింది. ఏడాది నుంచి ఈ రైలును పొడిగిస్తూ వస్తున్నారు. దానిలో భాగంగా ఈ నెల 16 నుంచి వచ్చే నెల 29 వరకు పొడిగించారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.50 గంటలకు నరసాపురంలో ఈ ఎక్స్‌ప్రెస్ బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.30కు బెంగుళూరు చేరుకుంటుంది. తిరిగి అక్కడ ఉదయం 10.50కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం ఆరు గంటలకు నరసాపురం వస్తుంది. ఈ రైలు నెల్లూరు, రేణుగుంట, కాట్‌పాడీ మీదుగా బెంగుళూరు వెళ్తుంది.

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రకాశం పంతులు కుటుంబీకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, ఆగస్టు 11 : టంగుటూరి ప్రకాశం పంతులు లాంటి మహనీయులను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. జై ఆంధ్ర (జైభారత్) సమాచార హక్కు సంఘం ఆధ్వర్యంలో తణుకులోని టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత చరిత్రపై ఆదివారం జాతీయ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి ఉన్నత చదువులు చదివి తొలి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారన్నారు. టంగుటూరి ధైర్యసాహసాలు ఆయన చూపిన మార్గం అందరికి ఆదర్శనీయమన్నారు. అనంతరం ప్రకాశం పంతులు కుటుంబీకులను సన్మానించారు. సమావేశంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బీహెచ్ సుమిత్రా నందన్, జాతీయ సలహాదారులు తమరాపు సత్యనారాయణ, కాకర్ల నాని, కడియాల సూర్యనారాయణ, వావిలాల సరళాదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై ఎమ్మెల్సీల సమన్వయ సమావేశం

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : టీచర్ల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన సమాచారం, పరిష్కార మార్గాలతో ముందుకు వస్తే విద్యా శాఖ మంత్రితో ఉపాధ్యాయ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించడానికి తాము చొరవ తీసుకుంటామని ఆదివారం విజయవాడలోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జరిగిన సమన్వయ సమావేశంలో ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ హామీ ఇచ్చారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో 117 రద్దు, తెలుగు మాధ్యమం కొనసాగింపునకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీలు వెల్లడించారన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా టీచర్లకు బోధనేతర కార్యక్రమాల తొలగింపు, తెలుగు మాధ్యమంలో టెన్త్ పరీక్షల నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం పథకం వర్తింపు, వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో లోపాలు, జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు, ఉద్యమాల సందర్భంగా టీచర్లపై బనాయించిన కేసుల ఉపసంహరణ తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నుంచి కదలిక లేదని ఎమ్మెల్సీల దృష్టికి తీసుకెళ్ళామన్నారు. ప్రభుత్వానికి, ఉపాధ్యాయ సంఘాలకు తాము వారధిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి చేయూత నిస్తామని హామీ ఇచ్చారన్నారు.

117 కేజీల రేషన్ బియ్యం స్వాధీనం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 11 : పట్టణంలోని డాంగేనగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యం కలిగిఉన్న చావా రామకృష్ణపై ఆదివారం కేసు నమోదు చేసి అతని నుంచి 117 కేజీల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్ డీటీ వైవీ లక్ష్మీకుమారి తెలిపారు. కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం కొని వాటిని పిండిగా మార్చి మార్కెట్‌లో అమ్ముతున్నట్లు ఆమె తెలిపారు. అతనిపై 6ఎ,7(1) కేసులు నమోదు చేశామన్నారు.

దేవదాయ, ధర్మదాయ ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక



ఉమ్మడి జిల్లాల దేవదాయ, ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘం నూతన కార్యవర్గం

భీమవరం టౌన్, ఆగస్టు 11 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘం నూతన కార్యవర్గం ఆదివారం తణుకులోని సీతారామంజనేయ స్వామి దేవస్థానంలో ఎన్నికైంది. జిల్లా అధ్యక్షుడిగా నల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా కె.జగదీశ్వరరావు, కార్యదర్శిగా ఇవ్వల శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా పి.నాగేశ్వరరావు, కోశాధికారిగా పి.కుసుమకుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎంవీవీఎస్ నందకుమార్, జీవీ రమణ, యూఎస్‌కే నబీ, ఎ.సాంబశివరావు, ఎంటీవీ రమణ ఎన్నికయ్యారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి



దొరమామిడిలో జరిగిన పీవోడబ్ల్యూ సమావేశంలో మాట్లాడుతున్న వెట్టి భారతి

బుట్టాయగూడెం, ఆగస్టు 11 : ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెట్టి భారతి, పి.లత డిమాండ్ చేశారు. ఆదివారం దొరమామిడిలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓట్ల కోసం, సీట్ల కోసం ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని అధిరోహించి వనరులను సృష్టించి హామీలను అమలు చేస్తామని ప్రకటించిన నేతలు ఇప్పుడు నిధుల కొరత వెంటాడుతుందని, అమలు కష్టంగా ఉందని చెప్పడాన్ని తీవ్రంగా విమర్శించారు. నిధులు కొరత ఎన్నికలకు ముందు తెలియదా? అని ప్రశ్నించారు. అధికారం కోసమే హామీలు ఇచ్చారు తప్పా మహిళలపై ప్రేమతో కాదన్నారు. మద్యం వలన మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం మద్యాన్ని ప్రధాన వనరుగా చేసుకోవడం సిగ్గు చేటన్నారు. మద్యాన్ని నిషేధించి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను పటిష్టం చేయడం కోసం అక్టోబరులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలన్నారు. నాయకులు ఈమని మల్లిక, కారం అరుణ, ధర్ముల లక్ష్మీ, తగరం సత్యవతి, సరియం అనిత తదితరులు పాల్గొన్నారు.

దిద్దుబాటుతో 'సర్దుబాటు'

నేటి నుంచి 14లోగా పూర్తి చేయండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : ప్రస్తుతానికి అమల్లోవున్న ఉపాధ్యాయ, విద్యార్థుల సంఖ్య నిష్పత్తి ప్రాతిపదికగానే గతంలో జారీ చేసిన మార్గదర్శకాల్లో కొన్ని సవరణలు చేస్తూ టీచర్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను సోమవారం నుంచి బుధవారంలోగా ముగించాలని ఆదేశిస్తూ పాఠశాల విద్య ఉన్నతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత విడుదల చేసిన మార్గదర్శకాల్లో కొన్ని అంశాలపై అభ్యంతరాలు రావడంతో సాధ్యమైనంత మేర సవరణలు చేస్తూ, ముఖ్యంగా ఏ ఒక్క పాఠశాలలోను సబ్జెక్టు టీచరు కొరత లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా... హేతుబద్ధీకరణను పక్కనబెట్టి పని సర్దుబాటు మాత్రమే చేపడుతున్నట్టు వివరణ ఇచ్చారు. తాజాగా సవరించిన మార్గదర్శకాల ప్రకారం అన్ని స్కూళ్ళలోను విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో ఉంటారని స్పష్టం చేశారు. కొత్తగా ఈ నెల తొమ్మిదో తేదీ నాటి యూడైస్ ఎన్ రోల్‌మెంట్ డేటాను ప్రామాణికంగా తీసుకుని వర్క్ అడ్జస్ట్‌మెంట్‌ను చేపట్టాలని ఆదేశించారు. స్కూలులో కేడర్ జూనియర్‌నే సర్‌ప్లస్‌గా గుర్తించాలని సూచించారు.

వివరణలు/సవరణలు ఇలా...

అంతర్ జిల్లా బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉపాధ్యాయుని సీనియార్టీని కొత్త జిల్లాలో విధుల్లో చేరిన తేదీనే ప్రామాణికంగా తీసుకుంటారు. ఇతర యాజమాన్యాల (ఎయిడెడ్ వగైరా) నుంచి ప్రభుత్వ పాఠశాలలో విధుల్లోకి చేరిన తేదీనే సీనియార్టీకి గుర్తించాలని సూచించారు. జీరో ఎన్‌రోల్‌మెంట్ ఉన్న పాఠశాలల్లోని టీచర్లందరూ సర్‌ప్లస్‌గానే నిర్ధారిస్తారు. హైస్కూల్ ప్లస్ ల్లోకి డిప్యూటేషన్‌పై నియమితులైన ఉపాధ్యాయులకు పని సర్దుబాటు నుంచి మినహాయింపునిచ్చారు. జీరో అడ్మిషన్లుగా ఉన్న హైస్కూల్ ప్లస్ ల్లోని ఉపాధ్యాయులను మాత్రం ఉన్నత పాఠశాల టీచర్లుగానే పరిగణించి వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేపడతారు. స్కూలులో శాంక్షన్ పోస్టుతో నిమిత్తం లేకుండా ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయులను కొరత ఉన్న పాఠశా లలకు సర్దుబాటు చేస్తారు. కనీస వేతన స్కేలు(ఎం టీఎస్)పై నియమితు లైన ఎస్జీటీలుకూడా సర్‌ప్లస్‌గాఉంటే పని సర్దుబాటును వర్తింపజేస్తారు.

నేడు సర్‌ప్లస్ టీచర్లకు ఆన్‌లైన్ సర్దుబాటు కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : ఉపాధ్యాయుల పని సర్దుబాటుకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ సోమవారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని డీఈవో అబ్రహం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మిగులు (సర్‌ప్లస్) ఉపాధ్యాయుల జాబితాను ఆదివారం రాత్రి జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపర్చడం తోపాటు, సంబంధిత టీచర్ల ఫోన్లకు వ్యక్తిగతంగా పాఠశాల విద్య కమిషనరేట్ నుంచి మెసేజ్ పంపించడం, ఎంఈవోల లాగిన్‌కు అప్‌లోడ్ చేయడం జరుగుతాయన్నారు. సదరు జాబితాలో ఉన్న సర్‌ప్లస్ టీచర్లు వారి వివరాలు సరిచూసుకుని, ఏవైనా తేడాలుంటే లిఖితపూర్వకంగా సంబంధిత ఎంఈవో కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటల్లోగా అర్జీల రూపంలో అందజేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ విధానంలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరుగుతున్నందున అర్జీలను ఉదయం 11 గంటల తర్వాత స్వీకరించబోమని స్పష్టం చేశారు. జాబితాలోఉన్న సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ సంబంధిత ఎంఈవో కార్యాలయాల్లో జరిగే పని సర్దుబాటు కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. కాగా జిల్లాలో మున్సిపల్ యాజమాన్య పాఠశాలల్లోని సర్‌ప్లస్ టీచర్లను మినహాయించి, మిగతా పాఠశాలల్లో 370 మందికిపైగా ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు 'మిగులు' జాబితాలో ఉన్నారు. వీరిలో పది శాతం మందిలోపే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. టీచర్ల కొరత ఉన్న పాఠశాలలు మాత్రం 220 వరకు ఉన్నాయి.

సైనికుల సేవలు వెలకట్టలేనివి

రాష్ట్ర హోం మంత్రి అనిత, కేంద్ర మంత్రి వర్మ



పరమవీరచక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న హోంమంత్రి అనిత , ఎమ్మెల్యేలు బొలిశెట్టి , పత్సమట్ల తదితరులు

పెంటపాడు, ఆగస్టు 11 : సైనికుల సేవలు వెలకట్టలేనివని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్గిల్ దివాస్ రజిత విజయోత్సవ వేడుకలలో హోంమంత్రి అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, అమరవీరుల విగ్రహానికి నివాళులర్పించారు. టీబీఆర్ సంస్థ నూతనంగా ప్రారంభించిన సైనిక్ అకాడమి శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఏపీ నిట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి అనిత మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన మాజీ సైనికుల సమస్యలను సీఎం చంద్రబాబుతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మాజీ సైనిక ఉద్యోగుల రిజర్వేషన్ పెంచేందుకు ఈ అంశాన్ని క్యాబినేట్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు. మరో ముఖ్య అతిథి కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ సైనికుల సేవల వల్లే దేశ ప్రజలందరూ సుఖ శాంతులతో జీవిస్తున్నారన్నా రు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మిలటరీ మాధవరంలో సైని క క్యాంటిన్ ఏర్పాటు చేయాలని హోం మంత్రిని కోరారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ సరిహద్దులో సైనికులు చేసే పోరాట ఫలితమే దేశం ప్రశాంతంగా ఉండటానికి కారణమన్నారు. అనం తరం పరమవీరచక్ర అవార్డు గ్రహీత సంజయ్‌కుమార్‌తో పాటు పలువురు మాజీ సైనిక ఉద్యోగులను శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, టీడీపీ నియోజకజవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి , బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, రాష్ట్ర సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.వెంకరెడ్డి, అగర్వాల్ పాకర్స్ పౌండర్ రమేష్ అగర్వాల్, విశ్రాంత మేజర్ జనరల్ బీవీ రావు, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ కేజీ కృష్ణ, కరస్పాండెంట్ పద్మావతి, డైరెక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

నీట్-పీజీ పరీక్ష ప్రశాంతం



పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 11 : పీజీ వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్-పీజీ ఆన్‌లైన్ పరీక్ష ఏలూరులోని రెండు కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో వంద మంది అభ్యర్థుల చొప్పున హాజరుకావాల్సి ఉండగా 99 మంది వంతున హాజరయ్యారు. సత్రంపాడు సిద్ధార్థ క్వెస్ట్ పరీక్ష కేంద్రంలో ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షలకు 149 మందికి 145 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 149 మందికి 147 మంది హాజరయ్యారు. నీట్-యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ ఉదంతం దేశవ్యాప్తంగా వివాదాస్పదం కావడంతో జూన్ 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్ష వాయిదావేసి పలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ఆదివారం నిర్వహించారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : మెడికల్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షలకు 222 మందికి గాను 216 మంది అభ్యర్థులు పరీక్షలు రాసినట్టు ప్రిన్సిపాల్ రత్నాకరరావు తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కుక్కునూరు, ఆగసు 11: మండలంలోని మారేడుబాక గ్రామానికి చెందిన గంటసాల శ్రీను (40) అనే వ్యక్తి ఆదివారం తెలంగాణలోని అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అమ్మవారి ఆలయం వద్ద జరిగిన ఫంక్షన్‌కి వంట చేసేందుకు మరో వ్యక్తితో కలిసి శ్రీను వెళ్ళాడు. ఆ కార్యక్రమం పూర్తయిన తరువాత ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా వినాయకపురంలోని పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. దీంతో దిచక్ర వాహనంపై వెనుక వైపు కూర్చున్న శ్రీను కిందపడి పోయాడు. ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్ళడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అస్వారావుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. తాడేపల్లిగూడెంలోని ఎన్టీఆర్ బొమ్మ వద్ద రోడ్డు పై నడిచి వెళ్తున్న ఒక వృద్ధుడిని (60) గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్ళిపోయింది. ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు 108 అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆస్పత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

స్కూటర్ ఢీకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : రోడ్డుపై నడిచివెళ్తున్న ఒక వృద్ధురాలిని బాలుడు స్కూటర్‌తో ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో ఆ వృద్ధురాలితో పాటు ఆ యువకుడికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఏలూరు అమీనాపేట పోలీస్ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన గుడివాడ వెంకట రమణ (70) ఆదివారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఏలూరు ఫైర్‌స్టేషన్ వద్ద నవయుగ హోటల్ ముందు రోడ్డుపై నడిచి వెళ్తుంది. ఏలూరు ఎమ్మార్సీ కాలనీకి చెందిన 17 ఏళ్ళ బాలుడు స్కూటర్‌తో ఆమెను ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా ఆ యువకుడికి గాయాలు అయ్యాయి. వీరిద్దరిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ సంఘట నపై వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, ఆగస్టు 11 : దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న ఒక వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ముసునూరు మండలం గుడిపాడుకు చెందిన జె హైమావతి (60) కొంత కాలం నుంచి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఆ వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం చికిత్స పొందుతుంది.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్ఐ నాగబాబు

ఆకివీడు, ఆగస్టు 11 : తాళం వేసి హైదరాబాద్ వెళ్ళిన ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు స్థానిక శ్రీరామపురానికి చెందిన గుగ్గిళ్ళ రవితేజ ఇంటి తాళాలు పగలగొట్టి బంగారం దొంగిలించినట్లు బంధువులు తెలిపారన్నారు. గత నెలలో (సుమారు 15 రోజులు) రవితేజ ఇంటికి తాళం వేసి హైదరాబాబాద్ వెళ్ళారు. ఆదివారం రవితేజ బంధువులు ఆకివీడు పెళ్ళికి వచ్చి శ్రీరామపురంలోని ఇంటికి వెళ్ళగా మెయిన్ ద్వారం తలుపులు తెరచి ఉండడంతో పాటు బీరువాలో బట్టలు చిందర వందరంగా ఉన్నాయి. బంధువులు రవితేజకు ఫోన్ చేసి విషయం తెలిపి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. బీరువాలో ఉండాల్సిన నగదు, బంగారం చోరీకి గురైనట్లు రవితేజ ఫోన్‌లో తెలిపారు. రవితేజ సోమవారం ఆకివీడు వచ్చిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. అనంతరం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

బాలిక మిస్సింగ్.. కేసు నమోదు

యలమంచిలి, ఆగస్టు 11: మండలంలోని ఒక గ్రామానికి చెందిన ఒక బాలిక శనివారం పాలకొల్లులోని జూనియర్ కళాశాలకు వెళ్లి తిరిగి రాక పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.గుర్రయ్య తెలిపారు. బాలిక పాలకొల్లు పట్టణంలోని ఒక జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతుంది. యధావిధిగా శనివారం ఉదయం ఇంటి నుంచి కళాశాలకు వెళ్లింది. బాలిక సాయంత్రం ఎంతసేపటికీ తిరిగి రాక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం గాలించారు. కుమార్తె ఆచూకీ లభించకపోవడంతో తండ్రి పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కేసుల నమోదు

ఉండి ఆగస్టు 11: 'ఎందుకు అంత ర్యాష్‌గా డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నావ్' అని అడిగినందుకు మోటర్ సైకిలిస్టును వ్యాన్ డ్రైవర్ గాయపరిచిన విషయంపై కేసు నమోదు చేసినట్లు ఉండి హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఈ ఘటన ఈ నెల ఎనిమిదో తేదీన ఉండి మండలం చెరుకువాడ శివారు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చోటు చేసుకుంది. ఇదే కేసుకు సంబంధించి ఆకివీడుకు చెందిన మోటర్‌సైకిలిస్టు మీరా మొహిద్దీన్ చెరుకువాడ వద్ద తన వ్యాన్‌ని నిలిపి తనను కొట్టి, వ్యాన్‌లో ఉన్న రూ.30 వేల నగదు తీసుకుని వెళ్లిపోయాడని భీమవరంనకు చెందిన వ్యాన్ డ్రైవర్ ఎలీషా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ యెషయా తెలిపారు. ఇరువురి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చాకుతో దాడి చేసి హత్యాయత్నం

భీమవరం క్రైం, ఆగస్టు 11 : భీమవరం రెండో పట్టణంలో ఇటీవల జరిగిన ఓ సినిమా పునఃప్రదర్శన సందర్భంగా ఓ యువకుడిపై హత్యాయత్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సినిమా ప్రదర్శన సమయంలో చిన్నపాటి ఘర్షణ శుక్రవారం జరిగింది. ఆ రోజు సాయంత్రం హర్షప్రవీణ్‌ను సీహెచ్ రాహుల్ చాకుతో పొట్టలో పొడిచి పారిపోయాడు. గాయపడిన బాధితుడ్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ్నుంచి వచ్చిన సమాచారంతో విచారణ చేశారు. నిందితుడ్ని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.వీర్రాజు తెలిపారు.

సబ్ సెంటర్‌లో ఫ్రిజ్ చోరీ



సిబ్బంది వద్ద వివరాలను సేకరిస్తున్న పోలీసులు

పెంటపాడు, ఆగస్టు 11 : స్థానిక పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సబ్ సెంటర్ తలుపు గొళ్ళాన్ని రాడ్‌తో పెకిలించి లోపల ఉన్న ఫ్రిజ్‌ను ఎత్తుకెళ్ళారు. సబ్ సెంటర్ బయట ఉన్న గుర్తులు బట్టి ఆటోలో ఫ్రిజ్‌ను తరలించి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై సబ్‌సెంటర్ అధికారులు ఫిర్యాదు మేరకు పోలీసులు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు.

కోడి వ్యర్థాల రవాణా వాహనం సీజ్

భీమడోలు, ఆగస్టు 11 : నిబంధనలకు విరుద్ధంగా చేపలకు మేత వేసేందుకు తరలిస్తున్న కోడి వ్యర్థాల వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఏలూరు మండలం కొక్కిరాయిలంక గ్రామానికి చెందిన ఘంటసాల శేషుబాబు అతని సొంత వాహనం టాటా యోధపై డ్రైవర్ అన్న, దొంగల రాజేష్‌తో కలిసి పోతవరం వెంకటేశ్వర హేచరీస్ నుంచి వ్యర్థాలతో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సూరప్పగూడెం రహదారిపై వాహనాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీకి యత్నం

» పల్నాడు జిల్లా నడికూడి వద్ద ఘటన » పశ్చిమలో ఉలికిపాటు



నరసాపురం, ఆగస్టు 11 లింగంపల్లి ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం తెల్లవారు జామున పల్నాడు జిల్లా నడికూడి సమీపంలోని దాచేపల్లి మాచర్ల రోడ్ ఓవర్ బ్రిడ్జి వద్ద ప్రయాణికులను దోచుకునేందుకు దోపిడీ దొంగలు విశ్వప్రయత్నం చేశారు. అయితే ప్రయాణికులు, రైల్వే పోలీసుల అప్రమత్తంతో దోపిడీ దొంగల ప్రయత్నం ఫలించలేదు. దీనికి సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నారు. నరసాపురం నుంచి లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ (17255) శనివారం సాయంత్రం 6.50 గంటలకు బయలుదేరింది. పల్నాడు జిల్లా నడికూడి జంక్షన్‌కు సమీపంలోని మాచర్ల ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకుంటున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చైన్ లాగారు. అప్పటికే రైల్లో ఉన్న కొందరు దొంగలు బోగీ తలుపులు తీశారు. ఆ ప్రాంతంలో మాటూ వేసిన దొంగలు బోగీలోకి ప్రవేశించి కొందరు మహిళల మెడలోని బంగారు ఆభరణాలు దోచుకునే ప్రయత్నం చేశారు. వారు కేకలు వేయడంతో బోగీలోని ఇతర ప్రయాణికులు లేచి దొంగల్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈలోగా రైల్వే పోలీసులు దోపిడీ జరుగుతున్న బోగీలోకి వచ్చారు. వారిని చూసిన దొంగలు రైలు దిగి పారిపోయారు. ఆరు నుంచి ఏడుగురు దొంగలు ఈ దోపిడీకి ప్రయత్నించిన్నట్లు రైల్వే పోలీసులు చెబుతున్నారు.

నిత్యాన్నదానానికి
రూ.49 లక్షల చెక్కు అందజేత



అన్నదానం నిధుల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, ఆగస్టు 11 శ్రీసోమేశ్వర జనార్దన స్వామివార్ల నిత్యాన్నదాన ట్రస్టుకు అన్నపూర్ణ పార్వతి సమేత శ్రీసోమేశ్వర లక్ష్మీ, జనార్దన స్వామి వార్ల నిత్యాన్నదాన కమిటీ నుంచి ఆదివారం రూ.49,82,825.53ల చెక్కును ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) చేతుల మీదుగా దేవస్థానంకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఆలయానికి వచ్చిన భక్తులకు స్వామి వారి ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో అప్పటి ఆలయ ఛైర్మన్ వేగేశ్న రంగరాజు దాతల నుంచి సేకరించి నిత్యాన్నదనాన్ని ప్రారంభించారని, ట్రస్టు బోర్డు ముగియడంతో అప్పటి నుంచి సేకరించిన నిధులను ఇప్పుడు నిత్యాన్నదానానికి అందజేశారని తెలిపారు. నిత్యాన్నదానానికి దాతల సహకారంతో షెడ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. అన్నదానానికి నిధులు సేకరించిన రంగరాజును సత్కరించారు. ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ ప్రధానార్చకులు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, బండి రమేష్ కుమార్, రాట్నల శ్రీనివాసరావు, గంటా త్రిమూర్తులు, నల్లం చిట్టిబాబునల్లం వెంకటకృష్ణనాగేశ్వరరావు, వేలూరి శ్రీదర్, చెరకుపల్లి సంతోష్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే అంజిబాబుకి అర్చకులు పూర్ణ కుంభస్వాగతం పలికారు.

పోలవరం నిర్వాసితులకు
పరిహారం ఇవ్వండి
మంత్రికి సీపీఎం నాయకుల వినతి



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కుక్కునూరు, ఆగస్టు 11: పోలవరం నిర్వాసితులకు కాంటూరుతో సంబంధం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ పరిహారం ఇవ్వాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, సీపీఎం బృందం నాయకులు కోరారు. పాలకొల్లులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడ్ని ఆదివారం వారు కలిసి వినతిపత్రం అందజేశారు. నిర్వాసితులు పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగాలు చేస్తున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే నిర్వాసితులపై ప్రభుత్వాలకు ఏమాత్రం శ్రద్ధ లేకుండా పోయిందని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2022 జూలైలో భారీ వరదలు వచ్చిన క్రమంలో ఏజెన్సీలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు మొత్తం వరదకు గురయ్యాయన్నారు. 41.15 కాంటూరు లేవిల్‌తో సంబంధం లేకుండా అన్ని గ్రామాలకు పరిహారం అందించాలని అన్నారు. అలాగే నిర్వాసితులకు వ్యక్తిగత పునరావాస పరిహారం, ఇళ్ల పరిహారం చెల్లించి పునరావాస కాలనీలకు తరలించాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి రామానాయుడు సానుకూలంగా స్పందించి నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల వరదల సమయంలో ప్రత్యక్షంగా చూశామని త్వరలో వారందరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారామ్, వై.నాగేంద్రరావు, ఎం.జీవరత్నం, వై.సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

కైకలూరు, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో కైకలూరులో శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్, హిందూ సంఘ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు కైకలూరు గాంధీబొమ్మ సెంటర్ నుంచి మాగంటి థియేటర్ వరకు జాతీయ రహదారి వెంబడి శాంతియుత నిరసన తెలియజేస్తామని ఈ దాడులను ఖండిస్తూ హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.



కలవపూడిలో కాల్వ తవ్వకం పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్, తదితరులు

డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనతో గ్రామాలన్నీ ఆరోగ్యకరం : కలెక్టర్

కాళ్ళ, ఆగస్టు 11 : మురుగునీరు సక్రమ పారుదలతో వ్యాధుల నుంచి గ్రామస్థులు రక్షణ పొందవచ్చని, దీనికి డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన ఎంతో ముఖ్యమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఆదివారం కలవపూడి గ్రామంలోని మామిడిపూడి రోడ్డు వద్ద మురుగుకాలువలో పూడిక తీత పనులను స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుతో కలిసి కొబ్బరికాయ కొట్టి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆక్వా చెరువులు పట్టుబడి అనంతరం కలుషిత నీరు మురుగు కాలువల్లోకి వెళ్ళడంతో ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు, గ్రామంలో రైతులందరూ కలిసి సుమారు రూ.13 లక్షలతో పనులను ప్రారంభించడం శుభపరిణామమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని చాలా డ్రెయినేజీల్లో గుర్రపుడెక్క, కిక్కిస, చెత్తను తొలగించడం చాలావరకు పూర్తయిందని, మరో రెండు, మూడు నెలల్లో పూర్తిగా ప్రక్షాళన చేస్తామన్నారు. తొలుత హైస్కూల్ ఆవరణలో కలెక్టర్, ఎమ్మెల్యేలు స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రాతాళ్ళమెరకలో మంచినీటి చెరువును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, సర్పంచ్ గేదెల జాన్, నాయకులు మంతెన పెద్ద నరసింహరాజు, మంతెన వెంకట శివాజీరాజు, గోకరాజు వెంకట శివరామరాజు, మంతెన వేణు, జీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలి

ఖరీఫ్ ఈ-పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెదఅమిరం పుంత రోడ్డులో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. పంట నమోదులో అలసత్వం వహించవద్దని సిబ్బందిని హెచ్చరించారు. వ్యవసాయశాఖ ఏడీ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున, ఆర్ఐ లక్ష్మీకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు

భీమవరం అర్బన్, ఆగస్టు 11 : కేవీపీఎస్ రాష్ట్రస్థాయి చైతన్య శిక్షణ తరగతులు సోమవారం నుంచి మూడు రోజుల పాటు భీమవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తామని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. క్రాంతిబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల నుంచి సుమారు 200మంది ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరుతారన్నారు. ముఖ్యఅతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, కలెక్టర్ నాగమణి, ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు తదితరులు దశల వారీగా హాజరవుతారన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ టాలెంట్ టెస్ట్ విజేతలు



టాలెంట్ టెస్టులో విజేతలైన విద్యార్థులు

తణుకు, ఆగస్టు 11: అంబేడ్కర్ సాహిత్య అకాడమీ తణుకు శాఖ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు డాక్టర్ అంబేడ్కర్ టాలెంట్ సెర్చ్ టెస్టును ఆదివారం అంబేడ్కర్ భవనంలో నిర్వహిం చారు. తణుకు పరిసర ప్రాంత కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్కేఎస్డీ మహిళా కళాశాల విద్యార్థినులు బి. అమీషా (ప్రథమ), బి. షణ్ము ఖేశ్వరి (ద్వితీయ), టి. వినయదుర్గ (తృతీయ) బహుమతులు గెలుచుకు న్నారు. అంబేడ్కర్ సాహిత్య అకాడమీ కో-ఆర్డినేటర్ నేతల సత్యాన్వేష్, కన్వీన ర్ మురాల నవీన్‌కుమార్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆస్పత్రికి ఫ్యాన్ల వితరణ



ప్రభుత్వాసుపత్రికి ఫ్యాన్లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

తణుకు, ఆగస్టు 11: తణుకులోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ మల్లిన అరుణ సారథి ఆర్థిక సాయంతో ఆదివారం 15 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. వేల్పూరు గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రుతి ప్రతిభను గుర్తించి రూ. 8 వేలు రోటరీ క్లబ్ ఆవరణలో జరిగిన కార్యక్ర మంలో అందించారు. సూపరింటెండెంట్ డాక్టర్ వి.అరుణ, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం మస్తాన్‌రావు, కఠారి సిద్ధార్థ, అక్కిన కాశీ విశ్వనాథం, కలగర వెంకట కృష్ణ, కె.సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గూడూరి కుటుంబ సభ్యులకు 'తోట' పరామర్శ

భీమవరం అర్బన్, ఆగస్టు 11: టీడీపీ పట్టణ కార్యదర్శి గూడూరి సుబ్బారావు, మాజీ కౌన్సిలర్ రామకృష్ణ తల్లి వీరమ్మ శుక్రవారం మరణించారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామ లక్ష్మి, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, ఆరో వార్డు బోక్కావారి పాలెంలోని వారి నివాసంకు వెళ్లి ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎమ్మెల్యే పితానికి టీడీపీ శ్రేణుల పరామర్శ

ఆచంట, ఆగస్టు 11 : ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సోదరుడు సూర్యనారాయణ మృతి పట్ల ఆదివారం టీడీపీ శ్రేణులు పితానిని పరామర్శించారు. అనంతరం సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పితానిని పరామర్శించిన వారిలో గొడవర్తి శ్రీరాములు, శ్రీరామ్మూర్తి, మొన్నవర్తి ప్రసాద్, గొడవర్తి రాము తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం..

- **భీమవరం అర్బన్, ఆగస్టు 11** : క్యాన్సర్ వ్యాధితో ఇబ్బంది పడుతున్న పాలని తాతారావుకు పట్టణంలోని 37వ వార్డు రజకపేట కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో రాష్ట్ర రజక సంఘం నాయకుడు చంద్రశేఖర్ రజక సంఘం తరఫున రూ.8 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందించారు.
- **పాలకొలుల అర్బన్** : పేదలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని స్థానిక జనతా ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్, క్రిటికల్ కేర్, ఐసీయూ విభాగాలను ప్రారంభించిన కార్యక్రమంలో మంత్రి నిమ్మల అన్నారు. ఆసుపత్రి డాక్టర్ ఆర్.శ్రీసాహిత్య, మిథున్ చక్రవర్తి, వైద్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.
- **భీమవరంటౌన్** : నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలపైనే ఆశలు పెంచుకోకుండా స్వశక్తితో అభివృద్ధిచెందటంతోపాటు పలువురికి అవకాశాలు అందించేలా ఉండాలని ఆదివారం అవిన్య ప్రొడక్షన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్థ బ్రోచర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు.
- **తాడేపల్లిగూడెం రూరల్** : తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నుంచి మూడు రోజుల పాటు సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో శర్మ తెలిపారు. శిక్షణ ప్రారంభ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరు కానున్నట్టు తెలిపారు.
- **పెనుమంట్ర** : పాలమూరులో శెట్టిబలిజ రామాలయం వద్ద తణుకు పట్టణానికి చెందిన వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 150 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.
- **మొగల్తూరు** : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం ఇచ్చిన తీర్పు నేపథ్యంలో మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఈనెల 13న చలో హైదరాబాద్‌లో జరిగే సభను విజయవంతం ఎమ్మార్పీఎస్ నరసాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమంచి అశోక్ ఆదివారం తెలిపారు.

నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్‌లోనూ

జగన్ విధ్వంసమే..

- రాష్ట్ర మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శ
- స్లూయిజ్ కొత్త తలుపు ఏర్పాటుకు రూ.50 లక్షలు మంజూరు



తుప్పుపట్టిన తలుపును పరిశీలిస్తున్న మంత్రి నిమ్మల, తదితరులు

యలమంచిలి, ఆగస్టు 11: జగన్ ఐదేళ్ల పాలనలో విధ్వంసం, నిర్లక్ష్యం పోలవరం, అమరావతిల్లోనే కాకుండా నక్కల అవుట్ ఫాల్స్ స్లూయిజ్‌లోనూ కనిపిస్తుందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విమర్శించారు. వడ్డిలంకలో నక్కల డ్రెయిన్ అవుట్ ఫాల్స్ స్లూయిజ్ వద్ద వరదల సమయంలో ఊడిపోయిన తలుపును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్లూయిజ్ పరిస్థితి, నిర్వహణ అంశాలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్‌లు, కాల్వలపై ఉన్న లాకులు, తలుపులు మరమ్మతులు చేయకపోగా, వాటికి కనీసం గ్రీజు నిర్వహణ కూడా పట్టించుకోకుండా గాలికొదిలేశారని విమర్శించారు. అందువల్లే నీటి ప్రవాహానికి గేట్లు కొట్టుకుపోవడం, తుప్పుపట్టిన రోప్‌లు తెగిపోవడం వంటివి జరుగుతున్నాయన్నారు. ఇటీవల వచ్చిన వరద ఉధృతికి స్లూయిజ్‌వద్ద తలుపు కొట్టుకుపోయిందని, ఈ పరిస్థితిలో వేరొక తలుపు తెచ్చి అమర్చామన్నారు. దీనికి కొత్త తలుపు ఏర్పాటుకోసం అత్యవసరంగా రూ.50లక్షలు మంజూరు చేశామన్నారు. జగన్ గత ఐదేళ్లు మొద్దు నిద్రపోయాడని.. ఆ పాపం ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. ఎన్డీఏ నాయకులు ఆరుమిల్లి రామశ్రీనివాస్, చిలుకూరి బాలాజీ, కడలి గోపి, జలవనరులశాఖ అధికారులు ఉన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు ఇదే సమయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు మంతెన సీతారాం



మాట్లాడుతున్న మంతెన సీతారాం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 11 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ఇదే మంచి సమయం అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సమత మహిళ భవనంలో ఆదివారం సీపీఎం జిల్లా సమావేశం సీనియర్ నేత కౌరు పెద్దిరాజు అధ్యక్షతన జరిగింది. ముఖ్యవక్తగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై ఆధారపడి ఉందని, మన రాష్ట్రానికి అవసరమైన నిధులు సమకూర్చుకునే అవకాశంతో పాటు ప్రత్యేక హోదా సాధించుకునే అవకాశం ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కాపాడు కోవడానికి మంచి సమయం అన్నారు. జిల్లా కార్యదర్శి సభ్యుడు బబలరాం మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం బకాయిలు పేరకుకుపోయాయని, వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు పీవీ ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, కేతా గోపాలన్, జేఎన్‌వీ గోపాలన్, సీహెచ్ బాబూరావు, జవ్వాది శ్రీనివాస్, జుత్తిగ నర్సింహమూర్తి, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలి



సీఐను కలిసిన గోరక్షణ సమితి నాయకులు

భీమవరంటౌన్, ఆగస్టు 11 :పట్టణంలో గోవులను రోడ్లపై వదలొద్దని, అటు వంటి పశువుల యజమా నులపై దృష్టి పెట్టి వారిని కఠినమైన చర్యలు తీసుకోవాలని గోసంరక్షణ అధ్యక్షుడు సుంకరదాసు కోరారు. ఈ మేరకు ఆదివారం సీఐ నాగరాజుకు వినతిపత్రం అందించారు. రోడ్డు మీద ఆవులను సురక్షిత మైన ప్రదేశాలలో ఉంచడానికి మీ వంతు సహాయం మాకు అందించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు.

కళాకారుడిగా షేక్ బాజీని మరువలేం



షేక్ బాజీ చిత్రపటం వద్ద కళాకారుల నివాళి

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 11 : పాలకొల్లుకు చెందిన రంగస్థలం, బుల్లితెర, సినీ పరిశ్రమలో మంచి పాత్రలు పోషించిన షేక్ బాజీని కళాకారుడిగా పాలకొల్లు ప్రజలు మరిచి పోలేరని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల మరణించిన షేక్ బాజీ సంస్మరణ కార్యక్రమం ఆదివారం స్థానిక ముస్లీం కమ్యూనిటీ భవనంలో నటీనట సమాఖ్య ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ షేక్ బాజీ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తూ కళాకారుడిగా రాణించడం అభినందనీయమన్నారు. కళాకారులు వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకట రత్నం, గుండా రామకృష్ణ, పోకల వెంకన్న, తణుకు రమణ, పుచ్చల నాగలింగేశ్వరరావు, సీవీవీ సత్యనారాయ ణమూర్తి, ఇనుముల వెంకటేశ్వరరావు, రామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదివి లక్ష్యాలు చేరుకోవాలి



రాహుల్ రిచర్డ్సకు సత్కారం

భీమవరం అర్బన్, ఆగస్టు 11: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి లక్ష్యాలను చేరుకోవాలని బార్ అసోసియే షన్ అధ్యక్షుడు ఎలేటి న్యూటన్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్ అన్నారు. అమెరికాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన బేతని పేటకు చెందిన రాహుల్ రిచర్డ్సను ఆదివారం బేతని చర్చిలో సంఘం సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పిల్లి సుదర్శన్‌కుమార్, బందెల సునీల్, పాక రతన్, సుగుణలీల, ఏఎస్ఆర్ శాస్త్రి పాల్గొన్నారు.

ఇంటింటా ఉచిత వైద్య సేవలు



పరీక్షలు చేస్తున్న డాక్టర్ హుస్సేన్

తణుకు, ఆగస్టు 11: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండే షన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా ఇంటింటా వైద్యసేవలు అందించారు. ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో 9 మందికి వైద్య సేవలందించారు. పారిశ్రామికవేత్త మల్లిన అరుణసారథి మనుమడి పుట్టినరోజు సందర్భంగా రూ. 5 వేల చెక్కును ఉచిత వైద్య సేవలకు అందించారు. సంఘ కార్యదర్శి స్వాలీహా, కోశాధికారి అర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సూర్య భగవానుడికి అభిషేకాలు



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 11 : శ్రావణ మాసం తొలి ఆదివారం సప్తమి సందర్భంగా స్థానిక కోడిగట్టున ఉన్న సూర్యదేవాలయంలో ప్రత్యేకంగా అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామివారికి ఆవుపాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మేడికొండ శ్రీనివాసరావుచౌదరి, మేడికొండ రామదాసు, సీహెచ్ సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు.

గంగాలమ్మకు ప్రత్యేక పూజలు

నరసాపురం రూరల్, ఆగస్టు 11: ఎల్‌బీచర్ల గ్రామంలో ఆదివారం గంగాలమ్మ అమ్మవారిని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పువ్వులతో అలంకరణ చేసిన అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ సన్నిధిలో భక్తుల కిటకిట

మొగల్తూరు, ఆగస్టు 11 : ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం కావడంతో అమ్మవారి దర్శనానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు కావల్సిన సదుపాయాలను ఈవో డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది కల్పించారు.

ఘనంగా మావుళ్ళమ్మ జాతర



మావుళ్ళమ్మ జాతరలో పాల్గొన్న కళాకారులు

భీమవరంటౌన్, ఆగస్టు 11 : పట్టణంలోని 37వ వార్డు లో ఆదివారం మావుళ్ళమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వ హించారు. జాతరలో గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలు, శక్తివేషా లు, అఘోరాల నృత్యాలు, బుట్ట బొమ్మలతో ఊరేగింపుగా గ్రామోత్సవం నిర్వహించారు. మాజీ కౌన్సి లర్ చెన్ను శాంతి, చెన్ను చంటి, ఎ.కుమరన్, మీనాంబిక, జూలూరి పండు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలైన దంపతులకు సన్మానం



దంపతులను సన్మానిస్తున్న కళాదర్బార్ సభ్యులు

ఆకివీడు రూరల్ ఆగస్టు 11 :అజ్జమూరు వాసి తెలుగు అధ్యాపకురాలు లంకా నాగశశికళకు శ్రీకృష్ణదేవరాయ సాహిత్య పురస్కారం లభించింది. రాయలసీమ రంగస్థలి-తిరుపతి, శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ ఆధ్వర్యంలో సాహిత్యంలో ఆమె చేస్తున్న సేవలకు గాను ఈ అవార్డును తిరుపతిలో ఆదివారం అందజేశారు. ఆధ్యాత్మికరంగంలో వేదపండితులు లంకా జలదుర్గా ప్రసాద్‌కు శ్రీకృష్ణ దేవరాయ పురస్కారం లభించింది. భార్యభర్తలిరువురిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు వారిని అభినందించారు.

26న శ్రీకృష్ణాష్టమి వేడుకలు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 11 :స్థానిక కెనాల్‌రోడ్డులోని ఎర్ర వంతెన వద్దగల శ్రీకృష్ణాలయం వద్ద శ్రీకృష్ణుడి జన్మదినం సందర్భంగా ఈనెల 26న ప్రత్యేక వేడుకలను నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం సంబంధిత కరపత్రాలను మంత్రి నిమ్మల రామానాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మన్నె శ్రీనివాస్, అధ్యక్షుడు ఇయ్యపు భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి యుగడ శ్రీనివాస్, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకలకు కార్యాలయం సిద్ధం



నగర పంచాయతీ కార్యాలయానికి రంగులు వేస్తున్న కూలీలు

ఆకివీడు, ఆగస్టు 10 : నగర పంచాయతీ కార్యాలయం పంద్రాగస్టుకు సుందర వందరంగా తీర్చిదిద్దుతున్నారు. పంచాయతీని నగర పంచాయతీగా చేసి మూడేళ్లు దాటుతున్న పేరు మార్చకుండా తాత్కాలికంగా వేరే బోర్డును ఏర్పాటు చేశారు. కార్యాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దండంలో భాగంగా నగర పంచాయతీ కార్యాలయంగా పేరు మార్చారు. పట్టణ పరిధిలో ఉన్న గాంధీజీ విగ్రహాలకు పెయింట్లు వేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

98 మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు

అత్తిలి, ఆగస్టు 11 : అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంచిలి భగవాన్ పూతరేకులు కార్యాలయం వద్ద శిరగాని నాగేశ్వరరావు ఆర్థిక సాయంతో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. పాలకొల్లు ఆర్ఆర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు 98 మందిని పరీక్షించారు. 47 మందికి కళ్ళజోళ్ళు అందజేసి పలువురికి మందులు ఉచితంగా అందించారు. 24 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. క్యాలెండరు ఆఫ్ ఈవెంట్స్ జిల్లా చైర్‌పర్సన్ యాతం రాంబాబు, క్లబ్ కార్యదర్శి వెంకట నారాయణ, బండి గంగాధర్, ఉలుసు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రంగరాజు మాస్టారుకు డాక్టరేట్

ఉండి,ఆగస్టు 11: పశ్చిమ గోదావరి జిల్లా నాటకరంగ వికాసం అనే అంశంపై పరిశోధన చేసినందుకు కర్ణాటక రాష్ట్ర సార్వత్రి విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ వచ్చిందని చెరుకువాడకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గాదిరాజు రంగరాజు ఆదివారం తెలిపారు. ఈ గ్రంథం జిల్లా తొలి నాటక రంగం కావడం తన అదృష్టం అన్నారు. ఉండి మండల మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. పలువురు మాస్టారును అభినందించారు. నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాదు, పెన్మెత్స రామకృష్ణంరాజు, యర్రా విక్రమ్ పాల్గొన్నారు.

మందాలమ్మకు వెండి కంచం బహూకరణ



వెండి కంచం అందజేస్తున్న భక్తులు

పెనుగొండ, ఆగస్టు 11 : వడలి గ్రామ దేవత మందాలమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భాగంగా విశాఖపట్టణానికి చెందిన విక్రమ్, రోజా దంపతులు వెండి కంచం అందజేశారు. ఆదివారం దంపతులిద్దరూ కుమారుడు నివాస్, కుమార్తె సుప్రజ కుటుంబ సభ్యులు అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో రూ.38 వేలు విలువైన 500 గ్రాముల వెండి కంచం బహూకరించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.

రూరల్ సీఐగా దుర్గాప్రసాద్ బాధ్యతల స్వీకరణ



దుర్గాప్రసాద్

నరసాపురం రూరల్, ఆగస్టు 11: నరసాపురం సీఐ దుర్గాప్రసాద్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కృష్ణా జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన ఎస్ఐగా కృష్ణాజిల్లాలో పని చేశారు. గన్నవరం, తోట్లవల్లూరు, కృష్ణలంక, సత్యనారాయణపురం స్టేషన్లలో పని చేశారు. 2013లో సీఐగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న గోవిందరాజు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎస్ఐలు, సిబ్బంది అభినందించారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

పెనుగొండ/మొగల్తూరు/అత్తిలి/ ఆగస్టు 11 :పెనుగొండ ఎస్ఐగా కె.గంగాధరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పెనుగొండ వాసవీ శాంతి ధామ్‌లో వాసవీ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొగల్తూరు మండలం మొగల్తూరు ఎస్ఐగా జి.వాసు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా బంటుమిల్లి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న జి.వాసును మొగల్తూరుకు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. అత్తిలి మండలం అత్తిలి ఎస్ఐగా పసుపులేటి ప్రేమ్‌రాజ్ బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి నుంచి బదిలీపై వచ్చి తొలుత అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఎస్సీ సెల్ నాయకుడు నీటిపూడి శ్రీనివాస్ తదితరులు ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.



సిద్దాపురంలో నిర్మాణంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) శివలింగం

వేగవంతంగా శివాలయ పునర్నిర్మాణ పనులు

- సుమారు మూడు శతాబ్దాల పూర్వం నాటి శివలింగం
- దాతల సహకారంతో నిర్మాణ పనులు

ఆకివీడురూరల్, ఆగస్టు 11 : సిద్దాపురంలో మంచినీటి చెరువు వద్ద వున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కొల్లేరు తీరప్రాంతమైన సిద్దాపురంలో సుమారు మూడు శతాబ్దాలకు పూర్వం ప్రముఖ శివాలయం ఉండేదని, ఈ ప్రాంతంలో తపస్సు చేసిన సిద్దులు, ఋషులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసేవారని ప్రతీతి. సిద్దులు ఎక్కువగా నివసించడంతో ఈ ప్రాంతం సిద్దాపురంగా పేరుగాంచిందని చెబుతారు. కాలక్రమేణ ఆ శివాలయం శిథిలమై లింగం మాత్రమే మిగిలిపోయి మంచినీటి చెరువుగట్టుమీద పందిరిలో ఎండకు ఎండి, వానకు తడిసి పూజలందుకుంటున్నది. బ్రహ్మసూత్రం కలిగిన మహిమాన్వితమమైన ఈ శివలింగాన్ని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన భూపతిరాజు తిమ్మరాజు ముందుకువచ్చి వారి కుటుంబం, దాతలు సహకారంతో ఆలయాన్ని సంవత్సరకాలంలో పునర్నిర్మించారు. తమిళనాడులోని కంచి కామకోటి పీఠం స్థపతి సుబ్బారావు వారి ఆధ్వర్యంలో విగ్రహప్రతిష్ఠ మొవ్వ సుబ్రహ్మణ్యరవి వారిచే పనులు పూర్తిచేసుకుని విగ్రహప్రతిష్ఠలకు సిద్ధంగా ఉంది. తమిళనాడు నుంచి వచ్చిన శిల్పులు ఆలయంపై ఆకృతులు ఏర్పాటు చేశారు. స్వామివారు, అమ్మవారితోపాటు, వినాయకుడు, సుబ్రహ్మణ్యం స్వామి, నవగ్రహాలు, అయప్పస్వామి, విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

గాంధీ ఆశయాల సాధనే నిజమైన స్వాతంత్ర్యం



గాంధీ ఆశయాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

భీమవరంటౌన్, ఆగస్టు11 :గాంధీజీ ఆశయాలు నెరవేరినప్పుడే నిజమైన స్వాతంత్ర్యమని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 76వ స్వాతంత్ర్య దిన వేడుకలలో భాగంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గాంధీజీ ఆశయాల బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 15 రోజులపాటు స్వాతంత్ర్య దిన పక్షోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గాంధీజీ చెప్పిన గ్రామ స్వరాజ్య నినాదాన్ని నిజం చేయాలన్నారు. పొత్తూరి వేంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగరాజు, అరుణోదయ మనోవికాస కేంద్రం డైరెక్టర్ సీహెచ్ అరుణదేవి పాల్గొన్నారు.

- అంటరానితనం నిర్మూలన, కుష్టువ్యాధి నివారణ అంశాలపై స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ ఆనాడే ఉద్యమం సాగించి ప్రజల్లో చైతన్యం కలిగించారని కుష్టు వ్యాధి కాలనీ అధ్యక్షుడు కె.వీర్రాజు అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా కుష్టు వ్యాధి కాలనీలో గాంధీజీ ఆశయలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు చిరస్మరణీయం



లాల్‌బహదూర్ శాస్త్రి చరిత్రను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 11: దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో లాల్ బహదూర్ శాస్త్రి చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కుల సంఘాలకు వైసీపీ కుచ్చుటోపీ : ధర్మరాజు



ధర్మరాజును సన్మానిస్తున్న రజకసంఘం నేతలు

గణపవరం, ఆగస్టు 11: వైసీపీ ప్రభుత్వ హయాంలో కుల సంఘాల ప్రజలు దగాపడ్డారని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆరోపించారు. గణపవరం, సరిపల్లె గ్రామాల రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సరిపల్లెలోని వేంకటేశ్వర రజక కల్యాణ మండపంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిధులను దారి మళ్ళించి కుల సంఘాలను నిలువునా ముంచిందన్నారు. కూటమి ప్రభుత్వం రజకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, కాపారం చిన్న, చనుమూరి లక్ష్మీభవాని, జనసేన నాయకులు పొత్తూరి వాసురాజు, తోట శ్రీనివాసరావు, కాళ్ళకూరి సత్యనారాయణ మూర్తి, రజక సంఘం అధ్యక్షుడు గుమ్మడి అప్పారావు, ఉపాధ్యాక్షుడు ఊడిగ అప్పారావు, ఎస్.రాముడు, మానవత మండల అధ్యక్షుడు బుద్దారపు పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు పలు వార్డుల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం

భీమవరంటౌన్, ఆగస్టు 11 :మునిసిపాల్టీ పరిధిలో బ్యాంకుకాలనీ, గునుపూడి, ఏఎస్ఆర్ నగర్, శ్రీరాంపురం రిజర్వాయర్ పంపింగ్ మెయిన్ ఇంటర్ కనెక్షన్ పనులు ఇంకా పూర్తి కానందున సోమవారం సాయంత్రం మంచి నీటి సరఫరా ఉండదని కమిషనర్ ఎం.శ్యామల తెలిపారు. ఈమేరకు రెండో పట్టణ ప్రాంతం మొత్తం, ఒకటో పట్టణ ప్రాంత పరిధిలో 11 నుంచి 26వ వార్డు ల ప్రజలందరూ మంచినీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలన్నారు.